సాక్షి
అనంతపురం
మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



కొత్త బంగారు లోకం..

అనంతపురం వైద్య కళాశాలలో 2కే24 బ్యాచ్‌కు తరగతులు ప్రారంభమయ్యాయి. కొత్త విద్యార్థులతో సందడి నెలకొంది. 8లో



20 నుంచి స్కూల్ గేమ్స్

అనంతపురం నగరంలో ఈ నెల 20 నుంచి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ వరకూ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 8లో

గరిష్టం/కనిష్టం
30.1°/22.4°

జిల్లా అంతటా సోమవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఏటీఎంను పగులగొట్టిన దుండగులు



పగిలిపోయిన ఏటీఎం

నార్పల: నార్పలలోని కూతలేరు బ్రిడ్జి వద్ద ఉన్న స్టేట్ బ్యాంక్ ఏటీఎంను ఆదివారం రాత్రి దుండగులు పగులగొట్టారు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా.. వెంటనే సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. బ్యాంకు అధికారులతో మాట్లాడారు. ఏటీఎంలో డబ్బు చోరీకి గురి కాలేదని గుర్తించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రాత్రిళ్లు పోలీసులు గస్తీ తిరుగుతున్నారన్నారు. ఎవరో అకతాయిలు చేసిన పనిగా గుర్తించామన్నారు. సీసీ ఫుటేజీని పరిశీలించి, నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు'



ఎమ్మెల్సీ మంగమ్మ

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని ఎమ్మెల్సీ మంగమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల చిలమత్తూరు మండలంలో అత్తాకోడలిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. మహిళలపై దాడులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ విషయాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనిత ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిశ పోలీసు స్టేషన్లను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

16 వరకు సామాజిక తనిఖీ

అనంతపురం అగ్రికల్చర్: రైతు సేవా కేంద్రాల్లో (ఆర్‌ఎస్‌కే) ఈనెల 16 వరకు ఈ క్రాప్ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ–క్రాప్, ఈ–కేవైసీలో పొరపాట్లు ఉంటే సరిచేసుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మల్బరీ తదితర పంటలు 10,54,356 ఎకరాల్లో సాగయ్యాయన్నారు. సామాజిక తనిఖీల్లో అభ్యంతరాలు ఉంటే వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏలను సంప్రదించి రాతపూర్వకంగా తగిన వివరాలు అందించి సవరించుకోవాలని సూచించారు.

జేఎన్‌టీయూ (ఏ)కు టైమ్స్ ర్యాంకు

అనంతపురం: టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్–2025లో జేఎన్‌టీయూ (ఏ)కు ర్యాంకు దక్కింది. అంతర్జాతీయ స్థాయిలో 801–1,000 ర్యాంకు, జాతీయ స్థాయిలో 23వ ర్యాంకు దక్కించుకుంది. నాణ్యమైన బోధన, ఉత్తమ పరిశోధన, పరిశ్రమలతో అనుసంధానంతో వర్సిటీకి గణనీయమైన ర్యాంకు దక్కినట్లు జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు తెలిపారు. ఇందుకు కృషి చేసిన ప్రొఫెసర్లకు ఆయన అభినందనలు తెలియజేశారు.

పచ్చ నేతల టెండర్

లాటరీ.. 'కొట్టేశారు'!

- మద్యం షాపుల్లో 90 శాతం టీడీపీ నాయకులకే
- టెండర్ దక్కించుకున్న సామాన్యులకు బెదిరింపులు
- టీడీపీ నేతలకు వత్తాసు పలికిన అధికారులు
- 'సిండికేట్'కు భయపడి నిరాశతో వెనుదిరిగిన ఔత్సాహికులు

అనంతపురం: అనుకున్నట్లే జరిగింది. మద్యం షాపుల టెండర్లలో టీడీపీ నేతలు మాయాజాలం చేశారు. దీంతో దుకాణాల్లో 90 శాతం 'తమ్ముళ్ల'కే దక్కాయి. ఎంతో ఆశతో దరఖాస్తు చేసి లాటరీ దక్కించుకున్న సామాన్యులను కూడా టీడీపీ నాయకులు బెదిరించి లైసెన్సులు లాక్కున్నారు. జిల్లాలో 136 మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపునకు సోమవారం నగరంలోని జేఎన్‌టీయూ ఆడిటోరియంలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు.ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యుల కనుసన్నల్లోనే వ్యవహారాలు నడిచాయి. కూటమి ఎమ్మెల్యేలు తమ సిండికేట్ ద్వారా భారీగా దరఖాస్తులు చేయించడంతో ఆడిటోరియంలో వారి అనుచరులు భారీగా తరలివచ్చి తిష్ట వేశారు. ఈ క్రమంలో అధికారులు సహకరించడంతో 'తమ్ముళ్ల' దోపిడీకి రాచబాట పరుస్తూ మద్యం దుకాణాల లైసెన్స్‌ల కేటాయింపు పర్వం కొనసాగింది.

ఇష్టారాజ్యంగా బెదిరింపులు..

మద్యం దుకాణం లైసెన్స్ దక్కించుకోవడం కాదు కదా.. కనీసం లైసెన్స్‌కు దరఖాస్తు చేసినా అంతు చూస్తాం' అన్నట్లుగా వ్యవహరించిన 'తెలుగు తమ్ముళ్లు' చివరికి లాటరీలోనూ బరితెగించారు. మద్యం షాపుల లైసెన్స్ దక్కకపోతే గొడవలు, దాడులకు వ్యూహం పన్నారు. జిల్లాలో అక్కడక్కడా అదృష్టవశాత్తూ మద్యం దుకాణం లైసెన్స్ దక్కించుకున్న వారిపై బెదిరింపులకు పాల్పడ్డారు. సిండికేట్‌లో లేకుండా ఎలా వ్యాపారం చేస్తారో చూస్తామంటూ హెచ్చరికలు చేశారు. మద్యం ఆదాయంలో కమీషన్ ఇవ్వాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు. షాపులు మంజూరైనా పోలీస్ కేసులు తప్పవని బెదిరింపులకు దిగారు. దీంతో ఎంతో ఆశతో దరఖాస్తు చేసి, లైసెన్సు దక్కించుకున్న అమాయకులు నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది.

❒ ఆత్మకూరు మండలంలో మద్యం షాపు నంబర్ 35 ఎం. స్వాతి అనే మహిళకు దక్కింది. టెండర్ ఖరారైనట్లు సర్టిఫికెట్ ఇచ్చే సమయంలో 'తమ్ముళ్లు' అడ్డు తగిలారు. 'స్వాతికి ఉద్యోగం ఉంది. లైసెన్స్ ఇవ్వడానికి కుదరదు' అంటూ రచ్చ చేశారు. ఈ క్రమంలో ఎక్సైజ్ అధికారులు కూడా స్వామి భక్తి ప్రదర్శించారు. ఆమె మొదటి కంతు కట్టడానికి సమ్మతించలేదు. 'సార్ ఉద్యోగం చేస్తున్నది నేను కాదు మా అక్క. ఆమె ఉద్యోగం చేస్తే నాకు టెండర్ ఇవ్వడానికేం ఇబ్బంది' అని స్వాతి వేడుకున్నా పట్టించుకోలేదు. అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులు దీనిపై ప్రశ్నించగా.. మీ సంగతి తేలుస్తామంటూ వారిని కూడా 'తమ్ముళ్లు' బెదిరించారు. దీంతో చేసేదిలేక స్వాతి నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. దరఖాస్తు చేసుకోవడానికి కూడా సవాలక్ష అవరోధాలు సృష్టించారని, ఆన్‌లైన్‌లో పత్రాలు సమర్పించి టెండర్ దక్కించుకున్నా బెదిరించి లాక్కొన్నారని స్వాతి వాపోయారు.



డబ్బు కట్టించుకోవాలంటూ ఎక్సైజ్ అధికారులను వేడుకుంటున్న స్వాతి



లాటరీ తీస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ శివనారాయణ శర్మ



జేఎన్‌టీయూ ఆడిటోరియంలో బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ పి. జగదీష్



మద్యం టెండర్‌దారులతో కిక్కిరిసిన జేఎన్‌టీయూ ప్రాంగణం



మద్యం షాపుల లాటరీకి చంటి పిల్లాడితో వచ్చిన మహిళ

ప్రశాంతంగా లాటరీ ప్రక్రియ

జేఎన్‌టీయూ ఆడిటోరియంలో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ, జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ ఆడిటోరియంలో నిర్వహించిన లాటరీ ప్రక్రియను ఎస్పీ జగదీష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమం అనంతరం విలేకరులకు వివరాలు వెల్లడించారు. లాటరీ ప్రక్రియను పూర్తిగా వీడియో చిత్రీకరించినట్లు తెలిపారు. ఆయా షాపులకు టెండర్లు దాఖలు చేసిన దరఖాస్తుదారుల సమక్షంలోనే లక్కీడిప్ తీసి షాపు దక్కించుకున్న వారి పేరు ప్రకటించామన్నారు. మొత్తం 136 షాపులకు టెండర్లు నిర్వహించగా, ఒక్కో షాపునకు సరాసరి 24 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. లైసెన్సు లభించిన వ్యక్తి పేరున అకౌంట్ ఓపెన్ చేసి, బ్యాంకు అధికారుల ద్వారా చలానా జనరేట్ చేసి కన్ఫర్మేషన్ ఇచ్చామన్నారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టంగా నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి, సీఐలు పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో భారీ వర్ష సూచన

- ఆ రెండు రోజులు విద్యాసంస్థలకు సెలవు
- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో ఈనెల 16, 17 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆ రెండు రోజులు అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగాన్ని సిద్ధం చేశామన్నారు. వాగులు, వంకలు, కాలువల పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండలన్నారు. ప్రజలకు తక్షణ సేవలు అందుబాటులో ఉంచేందుకు కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. మండలాలు, మునిసిపాలిటీల్లోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చామన్నారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 08554 –220009, 8500292992 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు. అలాగే, అనంతపురం ఆర్డీఓ కార్యాలయం– 1800 425 8802, కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయం 1800 425 8803, గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం–1800 425 8804 టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. వర్షాల కారణంగా ప్రాణ, పశు నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. జేసీబీ, ఇటాచీ, ట్రాక్టర్లు, నీటి ట్యాంకర్ల జాబితాను, వాటి యజమానులు, డ్రైవర్ల జాబితాను సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లాలో ఆరు పునరావాస కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత మిద్దెలు, భవనాల్లోని వారు ఖాళీ చేసి బంధువుల ఇళ్లకు వెళ్లాలని, లేదా పునరావాస కేంద్రాల్లో ఉండాలని కలెక్టర్ సూచించారు.

ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓగా ఆనంద్

అనంతపురం సెంట్రల్: జిల్లా అటవీశాఖ అధికారిగా ఆనంద్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎఫ్ఓ వినీత్ కుమార్ కడపకు బదిలీ కాగా.. సోమవారం ఆయన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. వినీత్ స్థానంలో మార్కాపురం టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న విగ్నేష్‌ను నియమించారు. అయితే, నూతన డీఎఫ్ఓ రాక ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఇన్‌చార్జ్ బాధ్యతలను పెనుకొండ డివిజనల్ ఫారెస్ట్ అధికారి ఆనంద్‌కు అప్పగించారు. మంగళవారం ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

గ్రీవెన్స్‌కు తప్పనిసరిగా హాజరవ్వాలి

- జిల్లా అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం
- 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'కు 253 వినతులు

అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, డీపీఓ నాగరాజు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 253 వినతులు అందాయి. అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పరిష్కార వేదిక కార్యక్రమానికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని డీఆర్ఓని ఆదేశించారు. సమస్యలపై ప్రజల నుంచి అందే అర్జీలను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలన్నారు.

వినతుల్లో కొన్ని...

- గుంతకల్లు పట్టణం హనుమాన్ జంక్షన్‌లో రూ.3 కోట్ల విలువ చేసే 16 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించాడని గుంతకల్లు వాసి బి.కె.రామచంద్రయ్య ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 412లో రెండు సెంట్లు, 412–బీలో 14 సెంట్లు మొత్తం 16 సెంట్లు ఆక్రమించారని చెప్పారు. దీనిపై ఫిర్యాదు ఇచ్చినా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోడం లేదని, సర్వే చేయించి ప్రభుత్వ భూమికి హద్దులు వేసి పరిరక్షించాలన్నారు.
- పిత్రార్జితం ద్వారా సంక్రమించిన నాలుగు ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని వజ్రకరూరు మండలం గడేహోతూరు గ్రామానికి చెందిన జాకీర్ హుసేన్ ఫిర్యాదు చేశారు. అన్ని పత్రాలను సమర్పించినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని, పత్రాలను పరిశీలించి భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు.
- భూమిని తన పేరున మార్పు చేసి పాసు పుస్తకం మంజూరు చేయాలని బుక్కరాయసముద్రం మండలం పొడరాళ్ల గ్రామానికి చెందిన కౌసల్య విన్నవించారు. తన భర్త హనుమంతరెడ్డి మరణించాడని, ఈ క్రమంలో గ్రామ పొలం సర్వే నంబరు 59లో ఆయన పేరున ఉన్న 1.80 ఎకరాల భూమిని తన పేరున మార్పు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పీఎం కిసాన్‌పై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం

- సొమ్ము జమ కాలేదంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: 'అన్నదాత సుఖీభవ' కింద ఏటా ప్రతి రైతుకూ రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో ఘనంగా చెప్పిన సీఎం చంద్రబాబు.. అధికారంలోకి రాగానే దాని ఊసే ఎత్తడం లేదు. దీంతో రైతులకు పెట్టుబడి సాయం ఇప్పట్లో అందే పరిస్థితి కనిపించడం లేదు. అటు కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద ఈ ఏడాది జూన్, అక్టోబర్‌లో రెండు విడతల కింద రూ.2 వేల చొప్పున రూ.4 వేల ప్రకారం రైతుల ఖాతాల్లోకి జమ చేసిన విషయం తెలిసిందే. జనవరిలో మూడో విడతగా రూ.2 వేలు జమ చేయనున్నారు. ఈ క్రమంలో బాబు ప్రకటించిన రూ.20 వేలు గుర్తుకు వస్తుందనే దురాలోచనతో వ్యవసాయశాఖ కూడా తన వంతుగా రాష్ట్ర సర్కారుకు కొమ్ము కాస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పీఎం కిసాన్ పథకంపై ప్రచారం చేయకుండా మిన్నకుండిపోతున్నారు. పీఎం కిసాన్ కింద సొమ్ము జమ కాలేదంటూ చాలా మంది రైతులు వాపోతున్నా పట్టించుకోవడం లేదు. ఆర్‌ఎస్‌కే సిబ్బంది మొదలు ఏఓ, ఏడీఏలతో పాటు జేడీఏ కార్యాలయం కూడా స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు ముందే ఈకేవైసీ, ఆధార్ సీడింగ్, మొబైల్ అనుసంధానం చేయించుకున్నా పీఎం కిసాన్ సొమ్ము జమ కాలేదని వాపోతున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది రెండో విడతగా (ఓవరాల్‌గా 18వ విడత) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 5న రూ.2 వేలు సొమ్ము విడుదల చేశారు. 18వ విడత కింద 2.79 లక్షల మంది రైతులకు రూ.55.83 కోట్లు ఇచ్చారు. పీఎం కిసాన్ విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలని వ్యవసాయశాఖకు ఆదేశాలు ఉన్నా పట్టించుకోలేదు. జిల్లా వ్యాప్తంగా జేడీఏతో పాటు 31 మండలాల ఏఓలు, డివిజన్ ఏడీఏలు ఈ కార్యక్రమాన్ని వీక్షించలేదని తెలుస్తోంది. పామిడి, మరో మండలం నుంచి మాత్రమే పీఎం కిసాన్ విడుదల కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో హాజరైనట్లు సమాచారం. గత ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' కింద ఏటా రూ.13,500 ప్రకారం ఐదేళ్లలో రూ.67,500 మేర లబ్ధి చేకూరినట్లు రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

తల్లడిల్లుతున్న తల్లీబిడ్డ

- సర్వజనాస్పత్రిలో కలగా మారిన 'తల్లీబిడ్డ ఆరోగ్య' విభాగం నిర్మాణం
- గర్భిణులు, బాలింతల అవస్థలు
- వైఎస్సార్ సీపీ హయాంలో 300 పడకలతో ఎంసీహెచ్ బ్లాక్ మంజూరు
- ప్రభుత్వం మారడంతో అతీగతీ లేని వైనం
- స్పందించని కూటమి ప్రజాప్రతినిధులు

అనంతపురం మెడికల్: గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. సర్వజనాస్పత్రిలో గర్భిణులు, బాలింతల అవస్థలను అప్పట్లో జిల్లా ప్రజాప్రతినిధుల ద్వారా తెలుసుకున్న ఆయన.. 'నాడు–నేడు' పథకం కింద రూ.300 కోట్లతో సర్జికల్, ఎంసీహెచ్ (మదర్ చైల్డ్ హెల్త్) బ్లాక్, పీజీ హాస్టల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సర్జికల్ బ్లాక్, మెన్స్ హాస్టల్ పనులు ప్రారంభించారు. ఎంసీహెచ్ బ్లాక్‌ను ఆస్పత్రి సమీపంలో ఉన్న ఆర్అండ్‌బీ కార్యాలయం ముందు నిర్మించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. అయితే, ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణం అంశం మరుగున పడిపోయింది.

ఎంసీహెచ్ బ్లాక్ అనివార్యం..

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పేద ప్రజలకు సర్వజనాస్పత్రి పెద్దదిక్కు. రోజూ ఇక్కడ 25 నుంచి 30 వరకు ప్రసవాలు జరుగుతాయి. అందులో 10 నుంచి 12 సిజేరియన్లు ఉంటాయి. ప్రసవాల్లో 15 వరకు కష్టతరమైన కేసులుంటాయి. జీజీహెచ్‌లోని 4 యూనిట్లలో 120 పడకలు మంజూరుకాగా, గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం 240 పడకలను అందుబాటులో ఉంచారు. ఈ క్రమంలోనే ఆస్పత్రి ఆవరణంలో షెడ్డు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. ఆరుబయట ఉన్న ఈ షెడ్డులోకి ఎవరెంటే వారు, ఎప్పుడంటే అప్పుడు ప్రవేశిస్తుండడంతో అవస్థలు చెప్పనలవిగా ఉంటున్నాయి.

అనంతపురం సర్వజనాస్పత్రిలోని లేబర్ వార్డులో ఒకే మంచంపై ఇద్దరు గర్భిణులకు సేవలందిస్తున్న దృశ్యమిది. వాస్తవంగా ప్రసవానికి వచ్చిన గర్భిణులు ఇబ్బందులు పడుతూ ఉంటారు. అలాంటి సమయంలో ఒక్కో మంచంపై వారిని ఉంచి సేవలందించాల్సి ఉంటుంది. కానీ, సర్వజనాస్పత్రిలో తగినన్ని పడకలు లేక ఇలా ఒక్కో మంచంపై ఇద్దరు, ముగ్గురిని ఉంచాల్సిన దుస్థితి నెలకొంది.



ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటైతే మరో 300 పడకలు అందుబాటులోకి వచ్చి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలందుతాయి. జిల్లాలోని 45 పీహెచ్‌సీలుండగా, ప్రతి పీహెచ్‌సీలో 5 నుంచి 10 ప్రసవాలు ప్రతి నెలా జరగాలి. కానీ చాలా పీహెచ్‌సీల్లో నెలకు ఒక్క ప్రసవం కూడా జరగడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఎంసీహెచ్ బ్లాక్ అనివార్యంగా మారింది.

మంత్రి దృష్టి సారిస్తేనే..

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఉమ్మడి జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాంటి ఆయన ఇలాకాలోని ఆస్పత్రిలోనే గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతుండడం గమనార్హం. ఈ విషయంపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తే ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటుకు అవకాశం ఉంటుంది.

సర్వజనాస్పత్రిలో ప్రసవాల వివరాలు

సంవత్సరం	మొత్తం ప్రసవాలు	సాధారణ ప్రసవాలు	సిజేరియన్లు
2021	9,161	5,128	4,033
2022	8,509	4,347	4,162
2023	8,574	4,205	4,369
2024 ఇప్పటి వరకు	5,945	2,654	3,291

ప్రభుత్వం శ్రద్ధ చూపాలి



ఉమ్మడి జిల్లా ప్రజలకు నాణ్యమైన సేవలందించడం కోసం రూ.30 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చాం. బోధనాస్పత్రి పడకల సంఖ్య 1,200 చేయడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన సేవలందించేందుకు సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటుకు అప్పటి సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి రూ.300 కోట్లతో భవన నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆస్పత్రికి సమీపంలో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్ ఉండాలని ఇరిగేషన్, ఆర్అండ్‌బీ కార్యాలయాలను తరలించాలని నిర్ణయించాం. కూటమి ప్రభుత్వం ఎంసీహెచ్ బ్లాక్ పనులు పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు



ఆస్పత్రిలో బాలింతల కోసం ఏర్పాటు చేసిన షెడ్డు

ఎంసీహెచ్ బ్లాక్‌తో నాణ్యమైన సేవలు

సర్వజనాస్పత్రిలోని నాలుగు యూనిట్లలో 120 పడకలు ఉన్నాయి. 300 మంది వరకు అడ్మిషన్లలో సేవలందిస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటు అత్యావశ్యకం. ఆ బ్లాక్ అందుబాటులోకి వస్తే బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన వైద్యం అందించవచ్చు.

– షంషాద్‌బేగం, హెచ్ఓడీ, గైనిక్ విభాగం, జీజీహెచ్

ఉత్తర్వులు రావాలి..

రూ.300 కోట్లతో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్, పీజీ హాస్టల్ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే సర్జికల్ బ్లాక్, హాస్టల్ పనులు జరుగుతున్నాయి. ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాలి. ఆర్అండ్‌బీ కార్యాలయం అధికారులు భవనాన్ని అప్పగించాల్సి ఉంది.

– చంద్రశేఖర్ రెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ

క్లుప్తంగా

ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్



కలెక్టర్ నుంచి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రిన్సిపాల్ సంగీతకుమారి

శింగనమల: నార్పలలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలకు ఐఎస్ఓ గుర్తింపు దక్కింది. సోమవారం కలెక్టర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సంగీతకుమారి ఐఎస్ఓ(ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... దేశంలోనే మొదటిసారి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకున్న ప్రభుత్వ గురుకుల పాఠశాలగా గుర్తింపు దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన, పాఠశాల నిర్వహణకు సరైన గుర్తింపు దక్కిందన్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు.

వ్యక్తి దుర్మరణం



మృతుడు కరియన్న

కణేకల్లు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన బోయ కరియన్న (46), తన బావమరిది వెంకటేశులుతో కలసి ద్విచక్ర వాహనంపై బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులోని పాండురంగ స్వామి ఆలయానికి బయలుదేరాడు. సోమవారం వేకువజాము 3.30 గంటల సమయంలో కణేకల్లు మండలం యర్రగుంట శివారులోకి చేరుకోగానే బళ్లారి వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన కరియన్న అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్పంగా గాయపడిన వెంకటేశును స్థానికులు కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై కణేకల్లు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పథకాలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్

అనంతపురం: సెక్స్ వర్కర్లకు వర్తించే ప్రభుత్వ పథకాలు, ప్రాథమిక హక్కులపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.శివప్రసాద్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యలకు సరైన పరిష్కారాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు, డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ఇటుక నల్లప్ప పాల్గొన్నారు.

కొత్త బంగారు లోకం!

- నరికొత్త ఆశలతో వైద్య విద్యలోకి అడుగుపెట్టిన విద్యార్థులు
- అనంతపురం వైద్య కళాశాలలో చేరికపై పలువురి ఆసక్తి
- 2కే24 బ్యాచ్ విద్యార్థులతో ప్రారంభమైన నూతన తరగతులు

ఆ విద్యార్థులు అనంత గడపలో అడుగు పెట్టారు. ఇతర రాష్ట్రాలు, భిన్న సంస్కృతుల నుంచి వైద్య విద్య కోసం అడుగు పెట్టిన వారంతా... 'వి లవ్ అనంత జీఎంసీ' అంటున్నారు. విభిన్న రాష్ట్రాల విద్యార్థులకు వేదికగా మారిన అనంతపురం లోని ప్రభుత్వ మెడికల్ కళాశాల.... నూతన విద్యార్థుల రాకతో సోమవారం ఆనందాలు విరబూసిన పొదరిల్లులా మారింది.



అనంతపురం జీఎంసీలోకి అడుగుపెట్టిన వైద్య విద్యార్థులు

అనంతపురం మెడికల్: సమాజంలో అత్యంత గౌరవ ప్రదమైన వైద్య వృత్తిలో తమ పిల్లలూ రాణించాలని తల్లిదండ్రులు పరితపిస్తుంటారు. ఈ క్రమంలోనే వైద్య వృత్తిలో నిలదొక్కుకోవాలనే అభిలాష చాలా మంది విద్యార్థుల్లోనూ వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ)లో ఎంబీబీఎస్ చేసేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఒకప్పుడు పీజీ సీట్లు, సరైన మౌలిక సదుపాయాలు లేక రాష్ట్రంలో వెనుకబడ్డ అనంతపురం బోధనాస్పత్రి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో పూర్తిగా రూపురేఖలు మారిపోయాయి. మౌలిక సదుపాయాలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, సమతుల్యమైన బోధనాసిబ్బంది తదితర సౌలభ్యాలతో జాతీయ స్థాయి వైద్య కళాశాలలతో అనంతపురం జీఎంసీ పోటీ పడుతోంది. ఈ క్రమంలో అనంతపురం జీఎంసీలో చేరేందుకు విద్యార్థులు పోటీపడ్డారు. బోధనాస్పత్రిలో ఏటా వివిధ విభాగాలకు సంబంధించి 117 మంది పీజీ విద్యార్థులు చేరుతున్నారు. ప్రస్తుతం 350 మంది పీజీ విద్యార్థులు రౌండ్ ద క్లాక్ సేవలందిస్తున్నారు. నిష్ణాతులైన వైద్యులు, సీనియర్ల పర్యవేక్షణలో వైద్య విద్యార్థులు మరింత రాటుదేలుతున్నారు. 2024 బ్యాచ్‌కు చెందిన యూజీ వైద్య విద్యార్థులకు సోమవారం నుంచి అనంతపురం జీఎంసీలో తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో విద్యార్థులు ఏమంటున్నారంటే...

ఉత్తమ కళాశాల అనే ఇక్కడ చేర్పించాం



నా బిడ్డ దేవీప్రసాద్‌కు ఆలిండియా కోటాలో ఏలూరు కళాశాలలో సీటు వచ్చింది. కానీ ప్రభుత్వ వైద్య కళాశాల ఉంటేనే బాగుంటుందని భావించాం. అందులోనూ అనంతపురం వైద్య కళాశాలలో సీటు రావడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడున్న మౌలిక సదుపాయాలు ఆకట్టుకున్నాయి. టీచింగ్ ఫ్యాకల్టీలు బాగా ఉన్నారు. ముఖ్యంగా ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు గౌరవించే తీరు నచ్చింది. నేనెలా సైనికుడిగా సేవలందిస్తున్నానో నా బిడ్డ దేవిప్రసాద్ కూడా వైద్యుడిగా ప్రజలకు సేవలందించాలన్నదే నా కోరిక.

– పీఎస్ రాత్, ఇండియన్ నేవీ ఆఫీసర్, ఒడిశా

చాలా సంతోషంగా ఉంది



నాన్న వెంకటరమణనాయక్ ఆర్‌ఐఓగా పనిచేస్తున్నారు. అమ్మ అరుణబాయి టీచర్. అన్న సాయి మహేష్ ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నారు. వీరి స్ఫూర్తితో వైద్య విద్య పట్ల ఆసక్తి పెరిగింది. రాష్ట్రంలోనే ఉత్తమ వైద్య కళాశాలల్లో ఒక్కటైన అనంతపురం జీఎంసీలో సీటు దక్కడం చాలా సంతోషంగా ఉంది. పీడియాట్రీషియన్ పూర్తి చేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తా.

– హారికసాయి, ఆదర్శనగర్, అనంతపురం

కార్డియాలజిస్టునవుతా



విద్యార్థి దశ నుంచే డాక్టర్ కావాలన్న లక్ష్యంతో బైపీసీ కోర్సు తీసుకున్నా. నా లక్ష్య సాధనలో నాన్న వన్నూర్ స్వామి (న్యాయవాది), అమ్మ మంజు (గృహిణి) అందించిన ప్రోత్సాహం మరువలేను. మా బంధువుల్లో ఎవరూ వైద్యులుగా లేరు. నేనే తొలి డాక్టర్‌ని కావడం ఎంతో ఆనందంగా ఉంది. అనంతపురం బోధనాస్పత్రిలో వైద్య విద్య నభ్యసించే అవకాశం దక్కడం సంతోషంగా ఉంది. కార్డియాలజిస్టు అవడమే నా లక్ష్యం.

– ఈవీఎస్ యోగిత, నేత్రపల్లి, గుమ్మఘట్ట మండలం

అమ్మ, నాన్న కోరికతోనే



నాన్న సుబ్రహ్మణ్యం రైల్వే ఉద్యోగి. అమ్మ రాజేశ్వరి గృహిణి. నన్ను డాక్టర్ చేయాలన్నదే వారి కోరిక. దీంతో నేనూ ఎంతో ఇష్టపడి చదువుకున్నా. నీట్‌లోనూ 600 ర్యాంక్ వచ్చింది. ఇతర కళాశాలల కన్నా అనంతపురం జీఎంసీ అయితే బాగుంటుందని ఎంపిక చేసుకున్నా. గైనకాలజిస్టు కావాలన్నదే లక్ష్యం.

– శృతి, గుంతకల్లు

ఉన్నత లక్ష్యంతోనే సత్ఫలితాలు



జ్యోతి ప్రజ్వలనగావిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

రాష్ట్రంలోనే కర్నూలు వైద్య కళాశాల తర్వాత మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నది ఒక్క అనంతపురం వైద్య కళాశాలలోనేనని, విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యనభ్యసిస్తే ఉత్తమ వైద్యులుగా ఎదుగుతారని అనంతపురం జీఎంసీ ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు అన్నారు. 2కే24 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థులకు సోమవారం ఎంబీబీఎస్ తరగతుల ప్రారంభోత్సవంలో భాగంగా పునశ్చరణ తరగతులను నిర్వహించారు. మొదటగా ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ చలపతి, డాక్టర్ మధు తదితరులు జ్యోతిప్రజ్వలన గావించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ప్రస్తుతం వైద్య కళాశాలలోని 19 విభాగాల్లో టీచింగ్ ఫ్యాకల్టీ సమృద్ధిగా ఉన్నారన్నారు. చదువుతో పాటు క్రీడలనూ ప్రోత్సహిస్తున్నామన్నారు. బోధనాస్పత్రిలో ఓపీ, ఐపీ సంఖ్య గణనీయంగా ఉందని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఉండడం ద్వారా విద్యార్థులు వైద్య వృత్తిలో పూర్తి పరిణితి సాధించేందుకు వీలుగా ఉంటుందన్నారు. యాంటీ ర్యాగింగ్ కమిటీలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్ మాట్లాడుతూ... పేద విద్యార్థులకు తమ వంతు సాయంగా ప్రభుత్వ వైద్యులు సంఘం ఉంటుందన్నారు. అనంతరం వివిధ విభాగాల హెచ్‌ఓడీలు తమ అధ్యాపక బృందం, పీజీలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పరిచయం చేసుకున్నారు. ఇదే కళాశాలలో విద్యనభ్యసించిన 2కే3(2003) బ్యాచ్‌కు చెంది, అసోసియేట్ ప్రొఫెసర్‌గా వైద్య కళాశాలలో సేవలందిస్తున్న డాక్టర్ పద్మశ్రావణి ఇక్కడున్న మౌలిక సదుపాయాలు ఇతర సౌలభ్యాలను వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ దీన్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బసిరెడ్డి ప్రవీణ పాల్గొన్నారు.

జెడ్పీలో ఎట్టకేలకు ప్రక్షాళన



అనంతపురం సిటీ: ఉద్యోగుల మధ్య వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న జిల్లా పరిషత్‌లో ప్రక్షాళన మొదలైందనే చర్చ జోరుగా సాగుతోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో జెడ్పీలో పని చేస్తున్న 33 మందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడమే ఇందుకు నిదర్శనమని అంటున్నారు. మొత్తం 81 మంది ఉద్యోగులు పని చేస్తుండగా ఐదేళ్లు పూర్తయిన వారు 8 మంది, మరో 19 మందిని రిక్వెస్ట్ కింద బదిలీ చేశారు. ఇంకో ఆరుగురికి పాలనపరమైన అంశాల కింద స్థానచలనం కల్పించారు. అయితే ఈ బదిలీల ప్రక్రియలోనూ ఇద్దరు ఉద్యోగులు కీలకంగా మారి ఒక్కో ఉద్యోగి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు స్థానాన్ని బట్టి అక్రమంగా వసూలు చేసినట్లు బలమైన ఆరోపణలున్నాయి.

అన్నీ సంచలనాలే

జిల్లాల పునర్విభజన అనంతరం అన్ని శాఖలూ రెండుగా విభజించారు. అయితే కీలకంగా ఉన్న సీఈఓ, డిప్యూటీ సీఈఓ పోస్టుల్లో ఇప్పటి వరకూ పని చేసిన అధికారులు విభజించు.. పాలించు తరహాలో వ్యవహరించడంతో పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. ఉద్యోగులు సైతం వర్గాలుగా చీలిపోయారు. ఒక్కో అధికారి పాలనలో కొంత మంది ఉద్యోగుల హవా నడుస్తూ వచ్చింది. తమ విధులు విస్మరించి తోటి ఉద్యోగులపై కక్ష కట్టినట్లు వ్యవహరించారు. అన్నీ తానై చక్రం తిప్పిన ఓ ఉద్యోగి మరో అడుగు ముందుకేసి ఓ మహిళా ఉద్యోగిని ఏకంగా లాడ్జికి రమ్మని పిలవడంతో బాధితురాలు ముఖ్య అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం గతంలో సంచలనంగా మారింది. ఇంకో ఉద్యోగి కార్యాలయంలోని ఓ గదికి తాళం వేసుకొని తన ఆధీనంలోకి తీసుకోవడం కూడా అప్పట్లో కలకలం రేపింది.

భారీగా నిధుల దుర్వినియోగం

పాలకవర్గం అనుమతి లేకుండా జిల్లా పరిషత్ పరిధిలో పైసా ఖర్చు పెట్టడానికి వీల్లేదు. అయితే మూడేళ్ల కాలంలో పని చేసిన సీఈఓలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. పాలకవర్గం అనుమతి లేకుండానే నిధులు డ్రా చేశారు. ఈ అంశంపై పంచాయతీరాజ్ కమిషనర్, కలెక్టర్లకు ఆధారాలతో సహా అనేక ఫిర్యాదులు వెళ్లాయి. అయినా కనీస స్పందన లేదు. విచారణ లేదు. తాగునీటి పథకాల నిర్వహణకు సంబంధించి కోట్లాది రూపాయలు డ్రా చేయడం దుమారం రేపుతోంది. అనేక సందర్భాల్లో ఈ అంశంపై పాలకవర్గ సభ్యులు నిలదీస్తూ వచ్చారు. ఓ ముఖ్య అధికారి బినామీ సంస్థకు, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి బోగస్ సంస్థకు కోట్లకు కోట్లు నిధులు చెల్లించడంపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు నిలదీసినా కలెక్టర్లు పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇలాంటి పరిస్థితుల్లో ఏకంగా 33 మంది ఉద్యోగులను బదిలీ చేయడంతో జెడ్పీలో ప్రక్షాళన మొదలైందనే చర్చ జోరుగా సాగుతోంది.

సాగునీటి సాధనకు నేటి నుంచి బస్సు యాత్ర

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



బస్సుయాత్ర, ధర్నా పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: పాలకుల విధానాల కారణంగా శతాబ్దాలుగా అనంతపురం జిల్లా వెనుకబడి ఉందని సీపీఎం జిల్లా కమిటీ విమర్శించింది. సాగునీటి వనరుల సాధనకు సరైన చర్యలు చేపట్టకుండా ప్రభుత్వాలు ఈ జిల్లాకు అన్యాయం చేశాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సాగునీటి సాధనకు మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ సీపీఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టి ప్రజలను చైతన్య పరచనున్నట్లు తెలిపారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాగునీటి సాధన, సమస్యల పరిష్కారానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో కరువును పారద్రోలాలంటే నదీ జలాలలను మళ్లించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సంపూర్ణంగా వినియోగించుకోవాలని అన్ని కమిటీలు సిఫారసు చేసినా అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని మండిపడ్డారు. జిల్లాకు వారసత్వ సంపదగా కోట్ల రూపాయలు విలువైన చెరువులు, కుంటలు ఉన్నాయన్నారు. ఒక్క టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయాన్ని నిర్మించేందుకు రూ.300 కోట్లు అవసరం అవుతుందన్నారు. అంత డబ్బు ఖర్చు చేయకుండా వందల టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవడానికి జిల్లాలో చెరువులు, కుంటలు అనుకూలంగా ఉన్నాయన్నారు. నీటి పారుదల కాలువలతో గ్రావీటీ ద్వారా చెరువులు, కుంటలను అనుసంధానం చేయాలనే రైతుల డిమాండ్‌ను పాలకులు అమలు చేయకపోడం శోచనీయమన్నారు. ఈ క్రమంలో బస్సు యాత్ర చేపట్టి నీటి సాధనకు ప్రజలను చైతన్యపరిచి ఉద్యమ రూపంలో సాధిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 21న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నల్లప్ప, సావిత్రి, నాగేంద్ర, బాలరంగయ్య పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం




శివకుమార్ (ఫైల్)

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామానికి చెందిన బుసగాని గొల్ల శివకుమార్ (17) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు....గ్రామానికి చెందిన బుసగాని గొల్ల నాగిరెడ్డి, రేణుకమ్మ దంపతులకు కుమారుడు శివకుమార్‌తో పాటు ఓ కుమార్తె ఉంది. కూలి పనులతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో నాగిరెడ్డి మద్యానికి బానిస కావడంతో పలుమార్లు దంపతుల మధ్య గొడవలు జరిగాయి. అయినా నాగిరెడ్డిలో మార్పు రాకపోవడంతో ఏడాది క్రితం కుమార్తెను పిలుచుకుని రేణుకమ్మ తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంట్లో నాగిరెడ్డి, శివకుమార్ ఇద్దరే కలసి ఉంటున్నారు. కూలి పనులకు వెళుతున్న శివకుమార్ కూడా ఇటీవల తాగుడుకు బానిసయ్యాడు. దీంతో తండ్రీకొడుకు మధ్య పలుమార్లు గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో క్షణికావేశానికి లోనైన శివకుమార్ సోమవారం ఉదయం బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చీరతో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భోజనానికని ఇంటికి వచ్చిన తండ్రి ఎన్నిమార్లు తట్టినా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూశాడు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని గుర్తించి చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

20 నుంచి స్కూల్ గేమ్స్

అనంతపురం: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19కు సంబంధించి షెడ్యూల్ ఖరారైంది. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ జి. లక్ష్మీనారాయణ సోమవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని క్రీడలు అనంతపురం వేదికగానే నిర్వహిస్తున్నారు. 20న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హ్యాండ్‌బాల్, 22న నారాయణ టెన్నిస్ అకాడమీలో టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్ పోటీలు, 23న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో త్రోబాల్, టెన్నికాయిట్, క్యారమ్స్, 24న సైక్లింగ్, మాల్కమ్, 25న విద్యారణ్య హైస్కూల్, ఎంకే స్పోర్ట్స్ అకాడమీలో ఆర్చరీ, 26న అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, 30న అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్విమ్మింగ్, నవంబర్ 1న అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో జిమ్నాస్టిక్స్ పోటీలు ఉంటాయి. పూర్తి వివరాలకు 94412 84618లో సంప్రదించవచ్చు.

టీ కేఫ్ ధ్వంసం



టీ కేఫ్‌లో ధ్వంసమైన గ్రానైట్ బండలు

తాడిపత్రి: స్థానిక సాయితేజ థియేటర్ ఎదురుగా సాక్షి దినపత్రిక విలేకరి మధుకుమార్ నిర్వహిస్తున్న లాయల్ టీ కేఫ్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విజయదశమి సందర్భంగా 3 రోజుల పాటు టీ కేఫ్ తెరవలేదు. ఆదివారం రాత్రి ఓ వాహనంలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు టీ కేఫ్ ప్రహరీలోని ఓ నల్లబండను పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. ఆవరణలో ఉన్న రెండు రెఫ్రిజిరేటర్లు, గ్రానైట్‌తో నిర్మించిన టేబుళ్లు, కుర్చీలు, షోకేస్, అక్కడి టీ పాత్రలు, సిమెంట్ రింగులు తదితరాలను ధ్వంసం చేశారు. ఆ సమయంలో చుట్టుపక్కల వారు గమనించి కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. స్థానికుల సమాచారంతో టీ కేఫ్‌కు వెళ్లిన మధుకుమార్ పరిశీలించి రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు గుర్తించాడు. ఘటనపై సోమవారం ఉదయం పట్టణ సీఐ సాయిప్రసాద్‌కు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



స్రవంతి

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న స్రవంతి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 1న అండర్–17 విభాగంలో అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల వేదికగా జిల్లా స్థాయి జట్టు ఎంపిక జరిగింది. జిల్లా నలుమూలల పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు. పోటీల్లో స్రవంతి అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో చోటు దక్కించుకుంది. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముదిరెడ్డిపల్లి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఆమె ప్రాతినిధ్యం వహించనుంది. ప్రతిభ చాటిన స్రవంతిని పాఠశాల హెచ్‌ఎం నరేంద్రనాథ్, పీడీ రవితేజరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

జరుట్లరాంపురంలో చిరుత



రామప్ప కొండపై సంచరిస్తున్న చిరుత

వజ్రకరూరు: మండలం జరుట్లరాంపురం సమీపంలోని రామప్ప కొండపై సోమవారం మధ్యాహ్నం ఓ చిరుత సంచరాన్ని స్థానికులు గుర్తించి తమ సెల్ ఫోన్లలో చిత్రీకరించారు. వారం రోజుల క్రితం రామప్ప కొండపై నాలుగు చిరుతలు సంచరించినట్లుగా ఈ సందర్భంగా గ్రామస్తులు గుర్తు చేశారు. కాగా, కొన్ని రోజులుగా గ్రామంలోని గొర్రెలు, దూడలు, ఆవులపై చిరుత దాడి చేసిందని, ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుత సంచారాన్ని అరికట్టాలని గ్రామస్తులు కోరారు.

నవంబర్ 3 నుంచి ఉద్యోగుల క్రికెట్ టోర్నీ

అనంతపురం: ఏపీ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా ఆర్డీటీ క్రీడా మైదానంలో నవంబర్ 3 నుంచి ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 23వ తేదీలోపు ఎంట్రీలు ఇవ్వాలని కోరారు.

బాలుడి ఆత్మహత్య



రుద్రప్ప (ఫైల్)

డి హీరేహాళ్(రాయదుర్గం): పండుగ పూట కొత్త దుస్తులు ఇప్పించలేదనే ఆక్రోశంతో ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన విశాలమ్మ, నాగేంద్ర దంపతలకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు రుద్రప్ప (15) దసరా పండుగ రోజు కొత్త బట్టలు కావాలని తండ్రి వద్ద పట్టుబట్టాడు. అయితే ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇబ్బంది పడుతున్న నాగేంద్ర... తన వద్ద ప్రస్తుతానికి డబ్బు లేదని, దీపావళికి కొనిస్తానని సర్దిచెప్పాడు. దీంతో మనస్తాపం చెందిన రుద్రప్ప ఈ నెల 11న ఇంటి నుంచి వెళ్లిపోయి గొడిశెలపల్లి సమీపంలోని హెచ్చెల్సీ వద్దకు చేరుకుని తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి తాను కాలువలో దూకి చనిపోతున్నట్లు తెలిపాడు. వారు ఎంత వారించినా వినకుండా నీటిలోకి దూకాడు. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల పొలాల్లోని రైతులు వెంటనే కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. ఆ రోజు నుంచి హెచ్చెల్సీలో నీటి ప్రవాహం దిశగా గాలింపు చేపట్టారు. సోమవారం కణేకల్లు మండలం ఎర్రగుంట వద్ద మృతదేహం లభ్యమైంది. తండ్రి నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'పోలీసు స్పందన'కు 77 వినతులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 77 వినతులు అందాయి. ఎస్పీ పి.జగదీష్ స్వయంగా వినతులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఫోన్ చేసి ఆదేశించారు.

విద్యార్థి మృతదేహం వెలికితీత



చంద్రశేఖరరెడ్డి (ఫైల్)

పెనుకొండ రూరల్: సరదాగా ఈత కొట్టేందుకు రిజర్వాయర్ ఇన్‌ఫ్లో వద్ద నీటిలో దిగి గల్లంతైన విద్యార్థి మృతదేహమై తేలాడు. వివరాలు... పెనుకొండ మండలం అమ్మవారిపల్లికి చెందిన చంద్రశేఖరరెడ్డి (19) అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. దసరా సెలవుల నేపథ్యంలో ఇంటికి వచ్చిన చంద్రశేఖరరెడ్డి... ఆదివారం తన స్నేహితులతో కలసి గొల్లపల్లి రిజర్వాయర్ వద్దకు చేరుకున్నాడు. కాసేపటి తర్వాత ఈత కొట్టేందుకు రిజర్వాయర్ ఇన్‌ఫ్లో వద్ద నీటిలో దిగిన ఆయన ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. స్థానికులు, పోలీసులు, కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సోమవారం ఉదయం రిజర్వాయర్‌లో మృతదేహం తేలియాడడంతో పోలీసులు వెలికి తీశారు. ఘటనపై కియా ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, విద్యార్థి మృతదేహానికి మంత్రి సవిత నివాళులర్పించి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉద్యాన రైతులూ జాగ్రత్త

అనంతపురం అగ్రికల్చర్: రాగల మూడు రోజులూ బలమైన పెను గాలులతో పాటు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఉద్యాన పంటల రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆ శాఖ డీడీ బీఎంవీ నరసింహారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అరటి, టమాట, బొప్పాయి తదితర రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటలకు ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు సస్యరక్షణకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

నీటితొట్టెలో పడి బాలుడి మృతి



బబ్లూ (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని భైరవానితిప్ప గ్రామానికి చెందిన వన్నూరప్ప, జ్యోత్స్న దంపతుల ఆరేళ్ల కుమారుడు కృష్ణ కిషోర్ (బబ్లూ) ప్రమాదవశాత్తు నీటి తొట్టెలో పడి మృతి చెందాడు. సోమవారం పిల్లలంతా కలసి బీటీపీ కట్ట వద్దకు వెళ్లి ఆడుకున్న అనంతరం మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. అయితే బబ్లూ మాత్రం ఇంటికి చేరుకోలేదు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ వెంకటరమణ గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యుల వద్ద వివరాలు సేకరించి చుట్టుపక్కల ప్రదేశాల్లో సిబ్బందితో గాలించారు. చివరకు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న నీటి తొట్టెలో బబ్లూ మృతదేహం గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలసిన అదనపు కమిషనర్



అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అదనపు కమిషనర్ ఇటీవల బదిలీపై అనంతపురం వచ్చిన విషయం విదితమే.

నాణ్యత లేకపోతే బిల్లులు రావు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి: గ్రామాల్లో చేపట్టే సీసీ రోడ్డు పనులు నాణ్యతగా లేకపోతే బిల్లులు మంజూరు చేయమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కాంట్రాక్టర్లను హెచ్చరించారు. మండలంలోని దాదులూరులో సోమవారం ఆమె పల్లె పండుగ వారోత్సవాలను ప్రారంభించారు. ఉపాధి పథకం కింద చేపట్టే సీసీ రోడ్డు పనులకు భూమి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులు సక్రమంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఏపీఓ వెంకటేష్‌నాయక్, ఏపీఎం హేమలత తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు భూమి పూజ



ఆత్మకూరులో భూమి పూజ చేస్తున్న అధికారులు

ఆత్మకూరు: మండలంలోని ఆత్మకూరు, పి.యాలేరు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం అధికారులు సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. అనంతరం ఎంపీడీఓ లక్ష్మీనరసింహాస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఏపీఓ సుజాత అధికారులు టీడీపీ నాయకులు శశాంక్, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంపనూరులో హుండీ కానుకల లెక్కింపు



పంపనూరులో హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలో వెలసిన సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. హుండీ కానుకలు లెక్కించగా రూ.22,48,779 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బాబు తెలియజేశారు. అనంతరం స్వామి వారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

యూనివర్సిటీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: యూనివర్సిటీల్లో 15 ఏళ్లుగా వివిధ పోస్టుల్లో పనిచేసే సిబ్బంది ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ పోస్టును బీసీలకు కేటాయించాలని కోరారు. ఈ సమస్యలపై మంత్రి లోకేష్ దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

డిసెంబరులో రాయలసీమ మహాకవి సమ్మేళనం

అనంతపురం కల్చరల్: డిసెంబరులో రాయలసీమ కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. సమ్మేళనంలో అందరూ భాగస్వాములై సీమ ప్రాధాన్యతను కవితా రూపంలో చాటాలని పిలుపునిచ్చారు. రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా నిర్వహిస్తున్న ఎనిమిదవ రాయలసీమ మహాకవి సమ్మేళనంలో విభిన్న రంగాల సీమ ప్రముఖులపై కవితలను రాసి డిసెంబరు 8లోపు 99639 17187 వాట్సాప్ నంబరుకు పంపాలని సూచించారు.

పూడికతీత వేగవంతం చేయాలి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని నడిమివంక, మరువవంకల్లో పూడికతీత వేగవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. సోమవారం వేణుగోపాల్‌నగర్, రజక్‌నగర్, సాయినగర్, అశోక్ నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, నగర ప్రజలకు ఇబ్బందులకు గురికాకుండా పూడికతీత పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. వంక పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, ఈఈలు షాకీర్ హుస్సేన్, రాధాకృష్ణ, కార్పొరేటర్లు రహంతుల్లా, అనిల్‌కుమార్ రెడ్డి, సైపుల్లాబేగ్, నాయకులు రామచంద్ర, అరవింద్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

భక్తిశ్రద్ధలతో గంధం వేడుకలు

అనంతపురం కల్చరల్: ప్రవక్త మార్గం అనుసరణీయమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త హజరత్ హాఫిజో ఖారి మౌలానా అన్నారు. మహిమాన్వితుడిగా పేరొందిన మాబు సుబహానీ (దస్తగిరి స్వామి) ఉరుసు ఉత్సవాలు ఎనిమిది రోజులుగా ఘనంగా సాగుతున్నాయి. నగరంలోని శ్రీనివాసనగర్‌లో షాహే గౌసే ఆజం ఆసార్ దర్గాలో కమిటీ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్ నేతృత్వంలో నిత్యం ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం దర్గా నుంచి పలు వీధుల గుండా పవిత్ర గంధాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు ఉరుసు ఉత్సవం

దర్గాలో మంగళవారం దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెహరిక్ ఫైజానే ఉమర్ ఫారుక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజా, మొహమ్మద్ ఖుష్‌హల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రసంగాలుంటాయని నిర్వాహకులు నవీద్‌ఖాన్, అబ్దుల్‌సమీ తెలిపారు. సాయంత్రం ప్రజల సందర్శనార్థం పవిత్ర కేశ దర్శనం ఉంటుందన్నారు.



మాబుసుబానీ దర్గాలో ప్రసంగిస్తున్న మతపెద్ద

ముఖ్య అతిథులుగా కర్నూలుకు చెందిన హజరత్ సయ్యద్ ఖమర్ పీర్ ఖాదిరి తనయులైన హజరత్ సయ్యద్ సందాని షాషా ఖాదిరి సాహెబ్, వజ్యూద్దీన్ ఖాదిరి, గుంటూరుకు చెందిన హజరత్ షాహిద్ రజ ఇప్పటికే విచ్చేసారని, కులమతాలకతీతంగా సాగే ఉరుసు ఉత్సవాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వంకల్లో నీరు సాఫీగా వెళ్లాలి



వంకను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం కార్పొరేషన్: నగరంలో నడిమివంక, మరువ వంకల్లో నీరు సాఫీగా వెళ్లేలా పూడిక తొలగించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ సోమవారం నగరంలో పర్యటించారు. రజక నగర్, సోమనాథ్ నగర్, 5, 6 రోడ్లు, రంగస్వామి నగర్, యువజన కాలనీ, నారాయణ కళాశాల, త్రివేణి టాకీస్, అశోక్‌నగర్ బ్రిడ్జి, ఎంజీ కాలనీ, ఖాజానగర్, హౌసింగ్ బోర్డ్‌లలో ఉన్న నడిమి వంక, మరువ వంకలలో చేపడుతున్న, చేపట్టాల్సిన పూడికతీత పనులను కలెక్టర్ పరిశీలించారు. నడిమి వంక, మరువ వంక, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తను, పూడికను వెంటనే తొలగించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. వంక వద్ద సైడ్ వాల్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. అధికారులకు ప్రజలందరూ సహకారం అందించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు, ఆర్డీఓ వసంత బాబు, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ హరికుమార్, నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కరరావు, ఈఈలు షాకీర్ హుస్సేన్, రాధాకృష్ణ, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ మూర్తి, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అమినిటీ సెక్రటరీలు ఉన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం కల్చరల్: క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. సోమవారం నగరంలోని జీసెస్‌నగర్‌లోని ఫెయిత్ చర్చిలో జిల్లా అధ్యక్షులు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో అసోసియేషన్ 52వ సర్వసభ్య సమావేశం జరిగింది. పాస్టర్ మనుష్షే ప్రత్యేక ప్రార్థనతో, పాస్టర్ కె.జీవన్‌బాబు ఆరాధనతో సమావేశం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన దైవసేవకులు భక్తిగీతాలతో దైవస్తుతి చేశారు. ముఖ్య ప్రసంగీకుడుగా రెవరెండ్ విజయ్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. క్రీస్తు శిష్యులకు చేసిన ఉపదేశాలను వినిపించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ క్రైస్తవ సమాజానికి తమ వంతు సహకారమందిస్తామన్నారు. క్రైస్తవ నాయకులు ఈటి స్వామిదాసు మాట్లాడుతూ పాస్టర్లు గౌరవ వేతనం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 21 మంది పాస్టర్లకు ఆర్థిక సాయమందించారు. కార్యక్రమంలో డాక్టర్ రెవరెండ్ బందెల రాజు, బిషప్ వాసు అనిల్‌కాంత్, అసోసియేషన్ ప్రతినిధులు మార్క్, జీఆర్ ఆనంద్, రూఫస్ కుమార్, జహంగీర్ జాషువా తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి దెబ్బతీస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్: ర్యాపిడో బైక్స్, ఓలా, ఉబర్ వంటి సంస్థలు తమ జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని నగరంలోని ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సంస్థలను నిరోధించాలంటూ ఏఐఎఫ్‌టీయూ (న్యూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు. నాయకులు హాజీవలి, నాగభూషణం, రాజు, సుధాకర్, తదితరులు మాట్లాడుతూ విద్యావంతులై ఉండి ఉద్యోగ అవకాశాలు లేక చాలా మంది ఆటోలు నడుపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఇటీవల కాలంలో రాపిడో బైక్స్, ఓలా, ఉబర్ వంటి సంస్థలు రావడంతో తాము ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఫైనాన్స్ ద్వారా తెచ్చుకున్న ఆటోలకు బాడుగలు లేక కంతులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

చెల్లించలేకపోతున్నామన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకుని ఆ సంస్థలను నియంత్రించి తాము ఉపాధి కోల్పోకుండా చూడాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం కార్యదర్శి చంద్రశేఖర్, స్త్రీ విముక్తి సంఘటన కార్యదర్శి మల్లీశ్వరి, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

మత్తు అనర్థాలపై మేల్కోవాలి

- ప్రభుత్వానికి ఐద్వా నేత సావిత్రి హితవు

అనంతపురం అర్బన్: చిలమత్తూరు మండలంలో అత్తాకోడలుపై జరిగిన అత్యాచార ఘటన తర్వాతైనా మత్తు అనర్థాలపై రాష్ట్ర ప్రభుత్వం మేల్కోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారి సావిత్రి హితవు పలికారు. సోమవారం నగరంలోని ఐద్వా కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అత్తాకోడలుపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మద్యం, గంజాయి మత్తు వల్ల ఎంతటి అనర్థాలు జరుగుతాయో చిలమత్తూరు ఘటనే ఇందుకు నిదర్శనమన్నారు. ఇలాంటి ఘటనలు సమాజాన్ని భయాందోళనకు గురిచేస్తాయన్నారు. మంత్రి సవిత సొంత జిల్లా, ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలో మహిళలకు రక్షణ లేకపోవడం ఆందోళనకరమన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి బాధితులకు సత్వర న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న సావిత్రి

ప్రభుత్వ తీరు సరికాదు

మద్యం మత్తులో ఘోరాలు జరకుండా ఉండలాంటే మద్యం నియంత్రణ, గంజాయి సంపూర్ణంగా నిషేధించాలని సావిత్రి పేర్కొన్నారు. అయితే మద్యం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరికాదన్నారు. విచ్చలవిడిగా మద్యం విక్రయాలకు ఆస్కారం కల్పిస్తూ నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి టెండర్లు నిర్వహించిందన్నారు. మద్యం టెండర్లకు మూడు రోజుల ముందు చిలమత్తూరు సమీపంలో అత్యాచార ఘటన చోటు చేసుకుందన్నారు. ఇకనైనా మద్యం మత్తుపై ప్రభుత్వం మేల్కోవాలని, మద్యం పాలసీపై పునరాలోచన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు చంద్రిక, కుమారి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంతకల్లుటౌన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి.మనోహర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింకులు, ఏపీకే ఫైళ్లను క్లిక్ చేస్తే సైబర్ బూచోళ్లు బ్యాంకు ఖాతాల్లోని డబ్బును దోచేస్తారన్నారు. మీ ఫోన్ బ్లాక్ అయ్యిందని, మీ బ్యాంక్ ఖాతా క్లోజ్ అయ్యిందని, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ఆఫర్ కార్డులని, మీ కరెంట్ కనెక్షన్ కట్ అయ్యిందని, ఈ-కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని, ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని వచ్చే లింకులను క్లిక్ చేయొద్దన్నారు. ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్, ఇన్‌స్టాల్ చేసినట్లయితే మీ ఫోన్ కంట్రోల్ మొత్తం నేరస్తుల చేతుల్లోకి వెళ్తుందని, మీ మొబైల్‌లోని బ్యాంక్ యాప్‌ల నుంచి డబ్బులను మీకు తెలియకుండానే నొక్కేస్తారన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్‌లో కంప్లెట్ రిజిస్టర్ చేసుకోవాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

ఐదుకల్లు స్ఫూర్తితో పోరాటాలు

అనంతపురం అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఐ వ్యవస్థాపకుడు ఐదుకల్లు సదాశివన్ స్ఫూర్తితో పోరాటాలు సాగిస్తామని సీపీఐ నాయకులు తెలిపారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఐదుకల్లు సదాశివన్ 39వ వర్ధంతి నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సదాశివన్ చిత్రపటానికి జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, సదాశివన్ తనయుడు ఐదుకల్లు రవీంద్ర, వీకే రంగారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదాశివన్ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు లింగమయ్య, రమణ, అల్లీపీరా, సంతోష్‌కుమార్, కుళ్లాయిస్వామి, నారాయణస్వామి, సుందర్‌రాజ్, జయలక్ష్మి, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.



ఐదుకల్లు సదాశివన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఘనంగా వసంతోత్సవం



వసంతోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

గుత్తి: గుత్తిలో దసర ఉత్సవాల ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్‌బాబు, నాగ సుదర్శన్ ఆధ్వర్యంలో ఆ సంఘం సభ్యులు, యువజన సంఘం సభ్యులు వసంతోత్సవం చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి ఊరేగించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఆనందంతో చిందులు వేయడంతో పాటు నృత్యం చేశారు.

అవినీతి, అక్రమాలు నిగ్గుతేల్చాలి

గుంతకల్లు రూరల్: వరద బాధితుల సహాయనిధిలో జరిగిన అవినీతి, అక్రమాలు నిగ్గు తేల్చాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బీ.సురేష్ మాట్లాడుతూ సెప్టెంబర్ మొదటి వారంలో భారీ వర్షాలకు విజయవాడ ప్రాంతంలో అనేక ప్రాంతాలు జలమయమయ్యాయన్నారు. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు వెంటనే ముందుకు వచ్చి వివిధ రకాలుగా సహాయ కార్యక్రమాలను చేపట్టాయని, అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధికి సుమారు రూ.500 కోట్లు జమయ్యాయన్నారు. వరద సహాయక చర్యల్లో విజయవంతం అయ్యామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం బాధితులకు ఏమి చేయలేకపోయిందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి అందిన మొత్తంలో భారీ ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయని, వెంటనే విచారణ జరిపించి వాటి నిగ్గు తేల్చాలని వారు డిమాండ్ చేశారు.

మంచి వంగడాలతో అధిక దిగుబడులు

- రబీ శనగ పంట విత్తు సమయమిదే
- కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ చెండ్రాయుడు

కళ్యాణదుర్గం: రబీ శనగ పంట విత్తుకోవడానికి సమయమిదేనని కళ్యాణదుర్గం కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ ఈ.చెండ్రాయుడు, సస్యరక్షణ విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ ఈ.శిరీష తెలిపారు. రబీలో శనగ పంటను సాగు చేసే రైతులకు వారు యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాలైన కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో ఏటా సుమారు 4 నుంచి 4.5 లక్షల హెక్టార్లలో శనగ పంట సాగు చేస్తారని ఆయన తెలిపారు. అయితే మన ప్రాంతానికి అనువైన అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలైన ఎన్‌బీఈజీ 452, జేజీ-11, ఎన్‌బీఈజీ 857 వంటి వంగడాలను అధికంగా రైతులు సాగు చేస్తారని తెలిపారు. ముఖ్యంగా శనగ పంట అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు విత్తుకోవచ్చని స్పష్టం చేశారు.

విత్తనశుద్ధి తప్పనిసరి..

శనగ పంట విత్తే ముందు రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ ఈ.చెండ్రాయుడు, సస్యరక్షణ విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ ఈ.శిరీష తెలియజేశారు. ముఖ్యంగా కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బెండజిమ్ లేదా 1.5 గ్రాముల టెబుకొనజోల్ తో పాటు 8-10 గ్రాముల ట్రైకోడెర్మాతో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల ఎండు తెగులు తట్టుకుని నష్టం నివారించొచ్చని తెలిపారు.



బెళుగుప్ప మండలం గంగవరం వద్ద సాగు చేసిన శనగ పంట (ఫైల్)

కలుపు యాజమాన్య పద్ధతులు ఇలా..

కలుపు యాజమాన్య పద్ధతుల్లో భాగంగా విత్తిన 24 గంటల్లోపు ఎకరానికి 1-1.2 మి.లీ ల పెండిమిథాలిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పురుగు, తెగుళ్ల యాజమాన్యంలో భాగంగా 5 శాతం వేపగింజల కషాయం పంట తొలిదశలో బీటీ ఫార్ములేషన్ 400 గ్రాములు ఎకరాకు, అలాగే ఉధృతి అధికంగా ఉంటే థైనాక్సిఫైర్ 40 మి.లీ లేదా ఫ్లూబెండమైడ్ 40 మి.లీ లు 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. వీటి వల్ల తెగుళ్ల నివారణ సాధ్యమవుతుంది. ఎండుతెగులు, మొదల కుళ్ల తెగుళ్లు, వేరుకుళ్ల తెగుళ్ల యాజమాన్యంలో భాగంగా వీటి నివారణకు ఎకరాకు 200 గ్రాముల కార్బెండజిమ్, 600 గ్రాముల మాంకోజెబ్‌ను కలిపి మొక్కలు, వేర్లు తడిచేలా పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల తెగుళ్లను నివారించి అధిక దిగుబడులు సాధించొచ్చు.

ప్రమాదంలో యువకుడి మృతి

కదిరి అర్బన్: లారీని ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మండలంలో పట్నం గ్రామానికి చెందిన భాస్కర్ (24) అనంతపురంలో పాల వ్యాన్‌కు డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. భార్య లక్ష్మి తొమ్మిది నెలల గర్భంతో ఉంది. దీంతో ఆమెకు కుటుంబసభ్యులు సీమంతం చేయాలంటే రెండు రోజులు క్రితం స్వగ్రామానికి పిలుచుకువచ్చాడు. ఆదివారం సీమంతం జరిగింది. వేడుక అనంతరం రాత్రికి తాను ఇంటికి వస్తానని తెలిపి సోమవారం ఉదయం భార్యను అనంతపురానికి పంపాడు. స్థానికంగా పనులు చక్కబెట్టుకున్న తర్వాత రాత్రికి ద్విచక్ర వాహనంపై అనంతపురానికి బయలుదేరిన భాస్కర్... పట్నం సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

చెన్నేకొత్తపల్లి: మండలంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీ బాలుర వసతి గృహం అధికారి శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోపు జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో అపహరణ

తాడిపత్రి: పట్టణంలోని నూతన కూరగాయల మార్కెట్ వద్ద ఆపి ఉంచిన ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన డ్రైవర్ గంగినాయుడు ఆటో తోలుకుంటూ జీవనం సాగించేవాడు. సోమవారం ఉదయం కూరగాయలు కొనుక్కునే క్రమంలో మార్కెట్ బయట ఆటో నిలిపాడు. మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసిన అనంతరం తిరిగి వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అలాగే పట్టణంలోని క్రిష్ణాపురంమూడో రోడ్డుకు చెందిన నాగార్జున అనే వ్యక్తికి చెందిన ఆటో గత ఫిబ్రవరిలో చోరీకి గురైంది. చోరీ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాప్తాడు: మండలంలోని ప్రజలు, అధికారులు భారీ వర్ష సూచన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మీ, వ్యవసాయాధికారి శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ వర్షాల ప్రభావానికి గురయ్యే ప్రదేశాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి విపత్తు సంభవించినా ఎదుర్కొనేందుకు, సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాలు ఉన్న నేపథ్యంలో ఈ నెల 17 తర్వాత వేరుశనగ పంటను తొలగించుకోవాలన్నారు.

ర్యాగింగ్ రహిత వర్సిటీగా ఎస్కేయూ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ

అనంతపురం: ర్యాగింగ్ రహిత యూనివర్సిటీగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ)ను నిలుపుతామని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత పేర్కొన్నారు. ర్యాగింగ్‌లేని యూనివర్సిటీగా ఎస్కేయూకు ఉన్న పేరును నిలబెట్టడానికి ప్రొఫెసర్లు, విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం యాంటీర్యాగింగ్ పోస్టర్లను వీసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.కృష్ణకుమారి, పీఆర్‌ఓ డాక్టర్ కె.రాంగోపాల్, న్యాయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రాంప్రసాద్‌కు ఎస్కేయూ డాక్టరేట్



రాంప్రసాద్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ విభాగంలో పరిశోధన చేసిన కె.రాంప్రసాద్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన రాంప్రసాద్ ప్రొఫెసర్ పంతుల మురళీకృష్ణ పర్యవేక్షణలో 'మేనేజ్‌మెంట్ ఆఫ్ అసెట్స్ ఇన్ ఇండియన్ బ్యాంకింగ్ సెక్టార్ - ఏ కంపారిజన్ స్టడీస్ ఆఫ్ సెలెక్ట్ బ్యాంక్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనలకు సంబంధించి పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురితమయ్యాయి.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయండి

పామిడి: పట్టణంలో రెండు ఆధార్‌కేంద్రాలు ఏర్పాటు చేయాలని పామిడి యువతబృందం సూర్యనారాయణ, రామాంజనేయులు, వీరప్రతాప్, సురేష్, నరేష్, రాజు, సతీష్, రామ్ తదితరులు తహసీల్దార్ శ్రీధర్‌మూర్తికి సోమవారం విన్నవించారు. ఆధార్‌కార్డు అప్‌డేట్ కోసం మండలేతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. పామిడిలోనే ఆధార్‌కేంద్రాలను ఏర్పాటుచేసి సమస్యలను అధిగమించాలని కోరారు.ఇందుకు తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. అలాగే భూ ఆన్‌లైన్ నమోదులో అవకతవకలు, సర్వేతో భూమి హద్దుల కేటాయింపు తదితర సమస్యలపై ప్రజలు గ్రీవెన్స్‌లో అధికారులకు అర్జీలు సమర్పించారు.